# చిన్నకథ

# మమతల్లేని మరుజన్మ

"ఓ దేవా! ఓ పరమాత్మా! నా మొర ఆలకించవా? నా వేదన తొలగించి నన్నాదుకోవా?" జీవాత్మ పరమాత్మతో విలపిస్తూ అంది.

"ఏమైంది జీవా! నీ బాధ ఏమిటో కాస్త సవివరంగా చెప్పు" అన్నాడు పరమాత్మ.

"దేవా! ఈ విశ్వం ఆవిర్భావంలో నిరంతరం చలిస్తున్న నక్షత్రాది గ్రహగోళాల మయమయిన ఈ సృష్టిని మరింత అందంగా మారుస్తానంటూ జీవకళ ఉట్టిపడేలా చేశావ్!"

"అవునూ..! ఇప్పుడేమయింది?"

"రోజు రోజుకీ ఈ మనుష్యులు నిర్జీవ విధానాలనే ఇష్టపడుతున్నారనిపిస్తోంది. యాంత్రికత పెరిగిపోతోంది. నాకు ఊపిరాడకుండా ఉంది"

"నేనూ గమనిస్తూనే ఉన్నాను" ఏకీభవిస్తూ అన్నాడు పరమాత్మ.

"కానీ మరిచిపోతున్నావ్. నేను మాత్రం వారి పైశాచికత్వం చూడలేక జీవత్వాన్ని కోల్పోయేలా ఉన్నాను. తిరిగి మునుపటి జీవంలేని స్థితే వచ్చేలా ఉంది చూస్తూ ఉంటే"

"అంతటి వేదన ఎందుకూ" అన్నాడు పరమాత్మ.

"మరేం చేయను?" దీనంగా అంది జీవాత్మ.

"చూడు ఈ ఉదాహరణ" ఉత్సాహంగా అంటూ "అదిగో .. ఆ కట్టెలు కొట్టేవాడిని ఆపు" జీవాత్మను చైతన్య పరిచాడు.

***

"ఏయ్..! ఏం చేస్తున్నావ్? ఆ చెట్టును నిలువునా నరికేస్తున్నావే.. ఆపు" అరిచింది జీవాత్మ భూమాతలా మారిపోతూ.

తనని అదిలిస్తున్న ఆ పెద్దావిడ కట్టెలు కొట్టేవాడి కంటికి ఓ దేవతామూర్తిలా కాక మామూలు మనిషిలా కనిపించింది. అందుకే "ఎవరు నువ్వు? ఒంటరిగా అడవిలో ఏం పని నీకు?" గదమాయిస్తూ అడిగాడు.

"నేను ప్రకృతిని.. భూమాతను"

తళుక్కున తన ముత్తాతల నాటి కథ గుర్తొచ్చింది వాడికి. ఒక గొడ్డలి పోతే ఇనుప గొడ్డలితోపాటు వెండి, బంగారు గొడ్డళ్లను కూడా పొందిన వైనం వాడి మనసులో మెదిలింది. అరక్షణం కూడా ఆలస్యం చేయకుండా భూమాతను మాటల్లోకు దింపాడు.

"భూమాతవా? ఎవరు నమ్ముతారమ్మా.. ఈ రోజుల్లో ఇవన్నీ? నా పని నన్ను చేసుకోనీ.. ఇంకా చాలా చెట్లు నరకాలి" తన పని తాను చేసుకుంటూనే అన్నాడు వాడు.

"నాకు తెలుసు.. నీవు అన్నంత పనీ చేయగల సమర్థుడవు. నీకు కావలసినంత ధనం ఇస్తాను. బంగారపు గొడ్డలి ఇస్తాను. చెట్లు నరకడం ఆపు. హాయిగా బతుకు" అంది భూమాత.

దీవిస్తూ వరాలిచ్చే ఆ కారుణ్యపు మాటలు ఆ కఠినాత్ముడికి అసహాయతా పలుకులుగా వినిపించాయి. ఇంకాస్త ఎక్కువ రాబట్టాలన్న దురాశ వాడిని ధూర్తుడిగా మార్చింది.

"ఆ..ఆ..అవునవును. నిన్న నేను నా బంగారు గొడ్డలి ఇక్కడే పెట్టి మర్చిపోయాను. నువ్వేమయినా తీసావా? దాని పక్కనే వెండి గొడ్డలి కూడా ఉండాలి. ఇప్పుడా రెండూ ఇస్తావా? లేక నిన్నీ చెట్టుకు కట్టెయ్యనా?" కర్కశంగా ఉరిమాడు వాడు.

ఒక్క క్షణం ఒళ్లు జలదరించింది వాడిలోగల ముష్కర మనస్తత్వానికి. జీవాత్మ పరమాత్మను తలుచుకుంది., వాడిలోగల రాక్షసత్వాన్ని చూడమంటూ.

పరమాత్మ "చూడు ముందుంది ముసళ్ల పండగ" అన్నాడు మెల్లిగా సైగ చేస్తూ.

వెంటనే జీవాత్మ.. "ఓయీ.. కట్టెలు కొట్టేవాడా! ఇన్ని అబద్ధాలు చెప్పేస్తున్నావ్. నీకు బంగారం ఇచ్చే ఉద్దేశ్యంతో ఉన్న నన్ను మనస్తాపానికి గురి చేశావ్. నీకిక ఏ ధనమూ దక్కదు. ఇక్కణ్నించి వెళ్లు. లేదా శపిస్తాను." ఉగ్రరూపం దాల్చింది భూమాత.

"అహ్హహ్హా..! రేపే అప్పైనా చేసి అడవినంతా యంత్రాలు తెచ్చి చదునుచేస్తా! మైదానంలా మారుస్తా! ఏం చేస్తావోచూస్తా" దూకుడుగా వెళ్లాడు వాడు.

***

మర్నాడు నిజంగా అన్నంత పనీ చేయడానికి వచ్చాడు యంత్రాలతో సహా!



జీవాత్మకు గొంతు పెగలడం లేదు. పరమాత్మ ముందుకు వచ్చాడు.

వాడొక చెట్టు ఇలా ఎక్కాడో లేదో యంత్రం బిగించడానికి, జర్రున జారి ధామ్మని కింద పడ్డాడు. కింద పడీ పడగానే నిర్జీవంగా మారాడు.

జరిగేదంతా ఆశ్చర్యంగా చూస్తోంది జీవాత్మ. ఈ సంఘటన జరగగానే పని ఆగిపోయింది. ఆ వచ్చిన మనుషులూ, యంత్రాలు తిరిగి వెనక్కి వెళ్లిపోయాయి.

అక్కడే ఉన్న ఒక రాయి "మ్మ్..మ్మ్.. మ్మ్.. ఊఁ...ఊఁ.." అని తెగ అరుస్తోంది. గింజుకుంటోంది. ఆ రాయిలో ఉన్నది కట్టెలు కొట్టేవాడి ఆత్మ.

ఎవరికీ కనిపించడం లేదు. వాని ఆరాటం ఎవరికీ వినిపించడం లేదు.

యంత్రాలు, మనుషులు వెళ్లిపోవడంతో అడవంతా ప్రశాంతంగా వుంది.

"చూశావా! నన్ను క్షమించు అని ఒక్కమాట మాట్లాడ లేకున్నాడు" ఇంకా ఎగిరెగిరి పడుతున్న ఆ రాయిని చూస్తూ అన్నాడు పరమాత్మ.

"ఆశ్చర్యం!" అంది జీవాత్మ.

"ఇంత చిన్న విషయానికి తెగ కష్టపడిపోయావ్" అన్నాడు పరమాత్మ.

"చెడ్డోళ్లంతా ఇలా రాళ్ళుగా మారాల్సిందేనా?" అంది జీవాత్మ.

"అదిగో.. అప్పుడే ఆర్ద్రతా పలుకులు" నవ్వాడు పరమాత్మ.

"కాదు..కాదు.. ఆ రాయిని చూస్తే జాలేస్తుంది. వాడిలోని రాక్షసత్వం ఏమయ్యింది" విచిత్రంగా చూసింది జీవాత్మ.

"ఎప్పుడూ చెడు చూస్తూ భయపడతావే? ఆ చెడు ఉండేది కొంత భాగమే. మంచిని చూడు నిరంతరం"అన్నాడు పరమాత్మ.

"మరి..మరి.. ఆ రాయో!" అయోమయంగా అంది జీవాత్మ.

"మొత్తం భూగోళమంతా నిర్జీవమయంగా మార్చేలా కోపం నీలో కల్గిందిగా! ఏదీ ఆ కోపం"

"ఆ..ఆ రాయి?" వేలు చూపుతూ అమాయకంగా మళ్లీ అడిగింది జీవాత్మ.

"నీలో మార్దవం ఉన్నంత కాలం చరాచర సృష్టికి ఏమీ కాదు. ఎక్కడైతే చెడు ఉంటుందో అది భరించలేనంతగా భయంకరంగా మారినప్పుడు అలా రాయి కావాల్సిందే. అలాంటి వారిలో ఒక మంచి మార్పు మెల్లిగా రావాల్సిందే"

"అదే.. ఆ మార్పెప్పుడు వస్తుంది?" అడిగింది జీవాత్మ.

"నీవలా బాధపడిపోకు. మెల్లిగా కాలమే ఆ మార్పు తెస్తుంది"

"మరి..మరి.. ఆ రాయి..?" మళ్లీ మరోసారి బేలగా అంటున్న జీవాత్మను చూస్తూ చిరునవ్వుతో పరమాత్మ ఇలా అన్నాడు "నీలో మెల్లిగా మాయ కమ్ముతోంది. మగతగా నిద్రలోకి జారుకున్నావ్. ఇప్పుడు జరిగినవన్నీ మరచిపోతావ్. నీ దైనందిన జీవితంలో పాలుపంచుకుంటావ్"

***

"టక్... టక్... టక్.."

"ఎవరూ..?" ఆవలింత తీస్తూ మగతగా వున్న ఓ గొంతు.

"పేపరండీ"

"ఓ.. ఈ రోజు త్వరగా తెచ్చావే.. అక్కడే పెట్టు. తడి లేదులే.." మెల్లిగా బెడ్ మీదనుంచి లేస్తూ అంది ఆ కంఠం మరోసారి ఆవులింత తీస్తూ.

-అనుప్రియ